ప్రజాశక్తి

ఆదివారం 2 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి

ఉక్కు ఉద్యమానికి రెండేళ్లు

నగరంలో భారీ ప్రదర్శన, మానవహారం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తిప్పికొడతామని నేతల స్పష్టీకరణ

విశాఖ నగరంలో భారీ మానవహారం చేపట్టిన కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలకు శనివారానికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో జెఎసి ఆధ్వర్యాన దీక్షా శిబిరం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల గురజాడ విగ్రహం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు పడాల రమణ, భోగవిల్లి నాగభూషణం అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి విల్లా రామ్మోహన్ కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి దొమ్మేటి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని, మున్ముందు ప్రజల సహకారంతో ఈ ఉద్యమం మరింత ఉధృతం కానుందని స్పష్టం చేశారు. ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా మిగతా 2లో..

కోలాటంతో ఆకట్టుకున్న మహిళలు

ఘనంగా జానపద సంబరాలు

వార్త మెయిన్‌లో..

కెజిహెచ్ రోగులకు డైట్ ఛార్జీల పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లో డైట్ ఛార్జీలను పెంచారు. శనివారం నుంచి అవి అమలులోకి వచ్చాయి. ఇన్ పేషెంట్లుగా ఉండే రోగులతో పాటు, గర్భిణులకు కూడా ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కోసం ఒక్కొక్కరికీ రూ.36 చెల్లిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇవే డైట్ ఛార్జీలు అమలవుతున్నాయి. రోగులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఛార్జీలను రూ.80కి పెంచింది.

డ్యూటీ డాక్టర్ల కోసం రూ.80 చెల్లిస్తుండగా ఇకపై రూ.100 చెల్లిస్తారు. గర్భిణులకు ఒక్కొక్కరికీ రూ.100తో భోజనం అందించనున్నారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో 1200 మంది రోగులు, 56 మంది డ్యూటీ డాక్టర్లకు రోజూ అల్పాహారం, భోజనం సరఫరా చేస్తున్నారు.

యువతను మోసగించిన ప్రభుత్వం

వార్త 2లో..

విఎంఆర్‌డిఎ సెక్రటరీగా రంగయ్య

వార్త 2లో..

పోలమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తి

వార్త 2లో..

సుబ్బారావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, జగ్గునాయుడు
(ఇన్‌సెట్‌లో సుబ్బారావు ఫైల్ ఫొటో)

సిపిఎం నేత సుబ్బారావు మృతి

పలువురి నివాళి

వార్త మెయిన్‌లో..

కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాలు

మంత్రి మేరుగు నాగార్జున

విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, దేవరాపల్లి : రాష్ట్రంలోని ఎస్‌సి గురుకులాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా, శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఈ క్రమంలోనే మధురవాడ గురుకులానికి చెందిన విద్యార్థులు తమ వినూత్న ఆవిష్కరణతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని ఉదహరించారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తమ విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి, ఎంబిబిఎస్ సీట్లు కూడా సాధిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన్ని శనివారం సర్క్యూట్ హౌస్‌లో మధురవాడలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకులం విద్యార్థులు, టీచర్లు కలిశారు. తాము సాధించిన ఘనతను వివరించారు. డాక్టర్ రోబోట్ ఆవిష్కరణ ద్వారా సిఓఇకి చెందిన ఆరుగురు విద్యార్థులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని తెలిపారు. అనంతరం మంత్రి నాగార్జున విద్యార్థులు తయారు చేసిన డాక్టర్ రోబోట్‌ను పరిశీలించారు. దానిని తయారు చేసిన విద్యార్థులను అభినందించడంతో పాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు అందించారు.

అనంతరం మంత్రి దేవరాపల్లిలోని ఎస్‌సి గురుకులాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. గురుకులంలోని అన్ని విభాగాలనూ పరిశీలించిన అనంతరం విద్యార్థులకు టెన్త్ హాల్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అనకాపల్లిలో మానవహారం చేపట్టిన కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

'ఉక్కు' ఉద్యమానికి రెండేళ్లు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే కుట్రలను మోడీ ప్రభుత్వం కొనసాగిస్తోందని అన్నారు. ముడిఖనిజం, బొగ్గు, రైల్వే ర్యాక్స్, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకుండా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ఖాయిలా పరిశ్రమగా చేసి కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అన్ని ప్రైవేట్ స్టీల్ పరిశ్రమలకూ గనులు కేటాయించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం మొండిచేయి చూపిందన్నారు. ప్రభుత్వ బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన కార్పొరేట్లకు రుణమాఫీ చేసి, లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం రుణాలు రాకుండా అడ్డుకుంటోందన్నారు. 'రా మెటీరియల్ తీసుకురండి, ఇక్కడ తయారైన ఉక్కును తీసుకువెళ్ళండి' అని ఇఒఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్) ప్రకటన చేసి అశేష త్యాగాల ప్లాంట్‌ను స్టీల్ యాజమాన్యం అవమానించిందన్నారు. రాష్ట్రానికి కేంద్రం తీవ్ర ద్రోహం చేస్తుంటే రాష్ట్రంలోని బిజెపి నేతలు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అన్ని పార్టీల ఎంపీల సహకారం తీసుకొని పార్లమెంట్‌లో మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అఖిలపక్ష రాజకీయ పార్టీలను ప్రధాని వద్దకు తీసుకువెళ్లి ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు చంద్రశేఖర్, ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులు బిబి.గణేష్, రైతు సంఘం నాయకులు జి.నాయినబాబు, పెన్షనర్ల సంఘం కార్యదర్శి కె.సుధాకర్, తదితరులు ప్రసంగించారు. ప్రజానాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక మండలి కళాకారులు అలపించిన గేయాలు, డప్పు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వరంగ సంస్థల యూనియన్ల నాయకులు, అసంఘటిత రంగ కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదంటూ శనివారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో కామ్రేడ్ కోడిగంటి గోవిందరావు విగ్రహం వద్ద అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఐక్య పోరాటాలతో కర్మాగారాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుత్తల శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు వైఎన్.భద్రం, సిపిఐ ఎంఎల్ నాయకులు పిఎస్.అజయ్ కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు బాలకృష్ణ, నూక అప్పారావు, కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ ఐఆర్.గంగాధర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాన దొరబాబు, కోన లక్ష్మణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం కూడలిలో..

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు శనివారానికి 779వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్-1 విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, జె.రామకృష్ణ మాట్లాడారు.

కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాలు

టిక్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతిలో రాష్ట్ర సగటు ఫలితాల కంటే ఎక్కువ ఫలితాలను తమ గురుకులం విద్యార్థులు సాధిస్తున్నారని తెలిపారు. ఏ కారణంతోనైనా పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యూషన్లు పెట్టించి మళ్లీ పరీక్షలకు పంపిస్తున్న విధానం కూడా మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. పదో తరగతి తర్వాత ఉన్నత విద్యావకాశాలు మెరుగ్గా ఉండాలన్న లక్ష్యంతో ఐఐటి, నీట్ కోచింగ్ సెంటర్లను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఐఐటి, నీట్‌లలో మరిన్ని సీట్లు సాధించే లక్ష్యంతో ఈ ఏడాది నుంచి తమ విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పై చదువులు నిమిత్తం విదేశాలకు వెళ్లడానికి కూడా అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

పోలమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 4న మంగళవారం జరగనున్న పెదవాల్తేరు శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని విశాఖ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పేర్కొన్నారు. శనివారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పిండింట్ల శంకరరెడ్డి, 17వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు గేదెల నాగరాజు, 20వ వార్డు నాయకులు మువ్వల సురేష్ పాల్గొన్నారు.

అధికార పార్టీలో ఆందోళన..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రమాదాన్ని ముందుగా ఊహిస్తే సగం అధిగమించినట్టే' - అంటారు థామస్ ఫుల్లర్ అనే యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపికి సంబంధించి చూస్తే ఎమ్మెల్సీ ఎన్నికలను తమ ప్రభుత్వానికి సెమీఫైనల్స్ అంటూ మంత్రులు, పార్టీ పెద్దలు ఊదరగొట్టారు. ప్రజల్లో, ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రుల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఊహించలేకపోయి ఉంటారా ? లేదా జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు 'ట్రయల్'గా భావించి సర్దుకుంటుందా ? మండలి ఎన్నికలు సెమీఫైనల్స్ అన్నప్పుడు ఇక్కడ ఓటమి చెందాక ఫైనల్స్‌పై ఈ ప్రభావం (సాధారణ ఓటరు)పై పడకుండా ఉంటుందా ? పడకుండా ఉండేలాగ తమ పార్టీ మనుగడకు జరుగబోయే నష్టంపై ఒక అంచనాకు వచ్చి మేల్కొంటుందా ? అన్నవి ఇప్పుడు తాజా ప్రశ్నలు. ఇదంతా ఒక ఎత్తు కాగా... తాజా రాజకీయ పరిణామాలతో విశాఖపట్నం జిల్లాకు చెందిన వారే కాకుండా యావత్ ఉత్తరాంధ్ర అధికార పార్టీ మంత్రులు, ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధుల్లో రాజకీయ నిరాశ నెలకొంది. ప్రభుత్వ వ్యతిరేకత తమను వచ్చే ఎన్నికల్లో దెబ్బ కొడుతుందన్న ఆవేదనను వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది.

ఊరటనిచ్చే విషయాలున్నా ఆందోళన ఎందుకు ?

ప్రజా సంక్షేమం పేరుతో పథకాలను అమలు చేస్తూ పేద, సామాన్య కుటుంబాలకు రాష్ట్రంలో రూ.వందల కోట్లు నేరుగా బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడం కోవిడ్-19 తర్వాత నుంచీ కొనసాగుతూనే ఉంది. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేసిన రాష్ట్రం దేశంలోనే ఏదీ లేదంటూ వైసిపి నేతలు ఓ పక్క ప్రచారం చేసుకుంటున్నారు. కానీ రాజకీయ అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. ఉన్న వారు జారిపోతున్నారు. సాధారణంగా ఎలాంటి ప్రభుత్వంపైనైనా మూడేళ్ల దాటాక అసంతృప్తి ప్రజల్లో సహజంగా పెరగడం ఉంటుందన్నది రాజకీయ విశ్లేషకుల మాట. అయితే ఏ ఎన్నికలు నిర్వహించినా అధికార పార్టీకి దెబ్బ తగలడం ఇక్కడ గుర్తుంచుకోదగినది. సర్పంచ్‌లుగా సొంత పార్టీ నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులకు వివిధ అభివృద్ధి పనులకు నిధుల్లేక అల్లాడిపోతున్నారు. విశాఖపట్నం జిల్లా పంచాయతీ కార్యాలయం ద్వారా గ్రామ పంచాయతీలకు ఏటా గతంలో రూ.240 కోట్ల వరకూ వివిధ అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించేవారు. 2020 తర్వాత ఈ ప్రభుత్వ హయాంలో దీంట్లో

సగానికి నిధులు పడిపోయాయి. ఉపాధి హామీ పథకాలే అమలు అవుతున్నాయి. దీంతో అధికార పార్టీ సర్పంచ్‌లు.. గతంలో గ్రామస్థాయిలో డబ్బులు ఖర్చుపెట్టి గెలిచిన వారు నిరాశకు లోనవుతున్నారు. చాలా చోట్ల అధికార వైసిపికి వ్యతిరేక ప్రచారం వీరే చేస్తున్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ ప్రమాదాన్ని వైసిపి అధిష్టానం పసిగట్టిందా ? లేదా ? అన్నది చూడాల్సిందే..

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో విశాఖ రాజధాని వాదన ఇలా..

అధికార పార్టీ మంత్రులు, పార్టీ పెద్దలు ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల ఫలితాలనంతరం విశాఖ రాజధాని అంటూ ఊదరగొట్టడం మానుకున్నారు. జులైలో సుప్రీం కోర్టులో విషయం తేలాక.. ఆ వాతావరణం అధికార వైసిపికి అనుకూలమా? వ్యతిరేకమా? అన్న దానిబట్టి విశాఖ రాజధాని అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు తెస్తారా ? వీటేమిటితోనూ నిమిత్తం లేకుండా విశాఖలో వచ్చి జగన్ కూర్చొని పాలన చేస్తారా ? అన్న చర్చ జరుగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు నార్త్ ఆంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు రిఫరెండం కానుందని చెప్పినవారందరికీ నేడు నోట్లో పచ్చివెలక్కాయ పడినట్టయింది. ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్ వైసిపికి నమ్మిన బంటు. ఆయన గెలుపు సునాయాశం అంటూ వైసిపి నేతలు ఊకదంపుడు కొట్టి బోర్లాపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేకత ఆయన్ని దెబ్బతీసింది. 15 ఏళ్ళుగా పార్టీనే నమ్ముకున్న స్థానిక మత్స్యకార నాయకుడు కోలా గురువులుకు 22 ఓట్లు వస్తే ఎమ్మెల్సీగా గెలిచేవారు. కానీ 21 వచ్చి ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది.. ఈ గాయాలకు వైసిపి వద్ద చికిత్స ఉందా? అన్నదీ రానున్నకాలంలో తేలనుంది.

వైసిపిలో ఉంటూ టిడిపిలోకి జారిపోతున్న వారివల్ల తాము నష్టపోయామని దక్షిణం నియోజకవర్గంలో కోలా, సీతంరాజు ఒక్కటై 2024 ఎన్నికల్లో ఒక అవగాహనకు రావాలని పక్కా ప్లాన్‌తో ఉన్నారన్నది సమాచారం. అయితే ఇదే తడవుగా తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్రంలో ప్రజలంతా తమవైపు తిరిగిపోయారని, వైసిపి పని అయిపోయినట్టుగా అతి అంచనాలకు వెళ్లడం కనిపిస్తోంది. ఏదిఏమైనా వైసిపి తమ ప్రభుత్వంపై వ్యక్తమవుతోన్న వ్యతిరేకతను ఎలా ఎదుర్కొంటుందన్న చర్చ ఆ పార్టీలోని సాధారణ కార్యకర్తల్లో సైతం నెలకొంది.

యువతను మోసగించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యువత సన్మార్గంలో నడవాలంటే ఉపాధి అవకాశాలు ఉండాలని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాక ముందు పాదయాత్రలో జాబ్ క్యాలెండర్లు, ఉద్యోగ అవకాశాలు అంటూ బోలెడు ప్రకటనలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఆ హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని విమర్శించారు. సమావేశంలో తెలుగు యువత విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వలిశెట్టి తాతాజీ, ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రత్నకాంత్, చింటూ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన 20 పోస్టులను నింపుతూ విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అర్హులైన 20 మందికి శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు అంకితభావంతో విధులు నిర్వహించి సమాజంలో వెనుకబడిన వారి అభ్యున్నతికి తమ వంతు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఎస్సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణమూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ సెక్రటరీగా రంగయ్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ సెక్రటరీగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సిహెచ్.రంగయ్య శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మెట్రో పాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాద పూర్వకంగా కలిశారు.

పాస్‌పోర్టు పోయినది

పొన్నగంటి పెద్ద సన్యాసిరావు
తండ్రి సన్యాసిరావు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం ఎర్రవరం,7 గ్రామం తేది 14.03. 2023న ఎర్రవరం గ్రామం నుండి అచ్యుతాపురం జిరాక్స్ కి వెళ్లేటప్పుడు నా తాలూకా పాస్ పోర్ట్ పోయింది పాస్ పోర్ట్ నెంబరు j3954096 గలదుకావున ఎవరికైనా దొరికిన యెడల నా యొక్క ఫోన్ నెంబర్ కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

పొన్నగంటి పెద్ద సన్యాసిరావు
సెల్ : 9600742179

IN THE HONOURABLE COURT OF THE V ADDL, JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 423 / 2022

Between:
Bank of Maharashtra, Muralinagar Branch, Visakhapatnam, Rep. by its Senior Manager ... Plaintiff
And:
1. M/s. Royal Stock Point, Rep. by its prop: Mr. Komaravalli Butchilingam
2. Anasuri Appala Naidu ... Defendants

To
The Defendants:
1) M/s. Royal Stock Point Rep. by its prop: Mr. Komaravalli Butchilingam, S/o. Veeramallayya, Aged 60 years, D. No.39-33-108/7, VUDA Colony, Madhavadhara, Visakhapatnam-18
2) Mr. Anasuri Appala naidu, S/o. Chinna Appanna, Aged 52 years, D. No.39-9-142/1, Tennetinagar, Near Spencers, Madhavadhara, Visakhapatnam-18

SUMMONS

Please take summons that the above named plaintiff bank filed the above suit against you for recovery of money basing on loan documents and that the Honorable Court was pleased to order to issue summons to you and the same is stands posted to **25-04-2023** for your appearance. Hence, you should appear either in person or through a pleader on the above said date at **10:30 A.M** before the above said Honorable court to answer all the material questions, failing which the matter will be heard and determined in your absence as per law.
(By order of the Court)

CH. VENKATA RAO,
Advocate, # 54-11-20, Isukathota, Visakhapatnam-22, Cell: 9949505801
Visakhapatnam
Dt. 01-04-2023

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P.161/2015 in O.S.240/2011

Between :
Jogi Narasimhulu ...Decree Holder
And
1) Chintada Varalakshmi
2) Chintada Narayana Swamy ...Judgment Debtors

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు నెం.-1 యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తిని తేది.**27-04-2023**న వేలం వేయుటకు మహా రాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది.**27-04-2023** ఉదయం గం॥ **10.30** ని॥ల నుండి **సా॥5.00 గం॥**ల మధ్య సమయంలో వేలంవేయుదురు. సదరు వేలం పాటలో పాల్గొన దలచిన ఆసక్తిగలవారు పై తేదిన, పైతెలిపిన శ్రీకోర్టువారి ఎదుటహాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTY

Visakhapatnam District, Dwarakanagar Sub-Registry, Madhavadhara Village, S.No.33/4D, D.No.39-18-20/9, Neelagiri Towers, Flat No.5, in an extent of 415 Sft constructed in 15 Sq. yds undivided share out of 1088 Sq.Yds and Flat No.5 bounded by: **East:** Stair case, **South:** Coridar, **West:** Flat No.8, **North:** Vacant Land

DHR Value : Rs. 9,50,000/-
Amin Value : Rs. 13,00,000/-
JDR Value : Not furnished

S. ARUN DEV & K. RAJA GOPALA RAO
Advocates
Dolphin Aprts., Behind Hotel Taj, Maharanipeta, Visakhapatnam, **Cell:98485 66903, 9848353373**

మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్. 63 / 2022

కోరుకొండ క్రిష్ణ ... వాది
మరియు:
ఎలిశెట్టి రాముడు వగైరాలు ... ప్రతివాదులు

దావా సమను

3 టు 6 ప్రతివాదులు:
3. ఎలిశెట్టి జయప్రకాష్, తండ్రి రాముడు
4. ఎలిశెట్టి వంశీక్రిష్ణ, తండ్రి రాముడు
5. ఎలిశెట్టి తులసీరాం, తండ్రి అనంతరమణ
6. ఎలిశెట్టి గీతారాం, తండ్రి అనంతరమణ

జ్న నలుగురు సా. మర్రివలస గ్రామం, రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ పైని మరియు 1,2 ప్రతివాదులపైని దావా షెడ్యూలు ఆస్తికి డిక్లరేషను, మరియు పర్మినెంటు ఇంజక్షను నిమిత్తం మీపై పై కోర్టులో దావా చేసియున్నాడు. సదరు దావా **తే: 20-04-2023దీకి** వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదా నాడు పై కోర్టులో **ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్నయెడల తెలియజేసుకొనవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

యడ్ల వెంకటరావు
వాది తరపు అడ్వకేటు
చోడవరం.
సెల్: 9440122487
చోడవరం.
తే:1-4-2023

ఇల్లంతా పచ్చదనం

సేంద్రీయ సాగుతో కూరగాయల పెంపకం
మిద్దె సాగులో ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు

మిద్దె మీద ఆనపకాయలను పరిశీలిస్తున్న ఝాన్సీ

పండించిన ఆకుకూరలతో ఝాన్సీ

ప్రజాశక్తి -మధురవాడ : ఇల్లంతా పచ్చదనం... ఎటు చూసినా ఆహ్లాదం పంచే పుష్పాలు... వంట చేసుకునేందుకు తాజా కూరగాయలు... ఇదంతా మధురవాడ టైలర్స్ కాలనీలో దంపతులు చేస్తున్న కృషి. వారి డాబాపై సేంద్రీయ పద్ధతిలో మిద్దె సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

జివిఎంసి 7వ వార్డు పరిధి టైలర్స్ కాలనీలో బంగారు ఝాన్సీ, అశోక్ దంపతులు నివసిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయంపై మక్కువతో ఇంట్లో పాత డబ్బాలు, ప్లాస్టిక్ బకెట్లు కుండీలుగా ఉపయోగిస్తూ చిన్నపాటి మొక్కలు పెంచుతున్నారు. కొన్నింటికి మార్కెట్లో లభించే గ్రో బ్యాగ్లనూ వాడుతున్నారు. పండ్ల మొక్కల పెంపకానికి శాశ్వత పద్ధతిలో నిర్మాణాలు చేపట్టారు. ఎక్కడా రసాయనాలు వాడకుండా కూరలు, కూరగాయలు పండిస్తున్నారు.

నిత్యం ఇంట్లో మిగిలే ఆహార పదార్థాలు, వంటింట్లో వచ్చే వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారుచేస్తూ వాటినే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూల మొక్కలకు వేస్తున్నారు. వేపనూనె, కుంకుడు కాయ రసం, ఇంగువ ద్రావణం, మిర్చి ద్రావణం ఉపయోగిస్తూ. చీడ పీడలను నివారిస్తున్నారు.

మిద్దెపై బెండ, గోరుచిక్కుడు, సొరకాయ, మిర్చి, వంగ, బీర, దొండ, టమాటా, మునగ తదితర కూరగాయలు, పొనగంటి, గోంగూర, పాలకూర, కొత్తిమీర, పుదీనా, కరివేపాకుతో పాటు తులసి మొక్కలు సాగుచేస్తున్నారు. మామిడి, సపోటా, నారింజ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, టేబుల్ నిమ్మ తదితర మొక్కల్ని పెంచుతున్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉండేలా ప్రతి ఒక్కరూ సేంద్రీయ పద్ధతిపై అవగాహన పెంచుకుని, మిద్దె పంటకు ప్రాధాన్యం ఇస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఇంటి యజమానురాలు ఝాన్సీ అభిప్రాయపడుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని విరాట్నగర్కు చెందిన ఇంటర్ విద్యార్థిని రాయి భూమిక గత నెల 29వ తేదీ నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. మార్చి 28వ తేదీన ఇంటర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. 29వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని భూమిక ఆచూకీ తెలిసినవారు 9440796039, 9908166714 నెంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. భూమిక తల్లి ధనలక్ష్మి 8008842857 నెంబరుకు సమాచారం అందించవచ్చునని పోలీసులు వెల్లడించారు.

వరాహ పుష్కరణిలో మృతదేహం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం కొండ దిగువ వరాహ పుష్కరణిలో శనివారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి గోపాలపట్నం పోలీస్స్టేషన్కు సమాచారమందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ప్రహ్లాదపురంనకు చెందిన అప్పలరాజుగా గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉన్నాయని, ఎవరో హత్య చేశారని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్కు తరలించారు. గోపాలపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూ పార్కుకు ఆర్ఒ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్టి ఇంటిలిజెన్స్ విశాఖపట్నం యూనిట్ ఆర్థిక సాయంతో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు అత్యాధునిక ఆర్ఒ ప్లాంట్ను వితరణగా అందజేశారు. శనివారం జూ పార్కులో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్టి ఇంటిలిజెన్స్ జాయింట్ డైరెక్టర్ వై.భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూ పార్కుకు వచ్చే సందర్శకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వేసవి నేపథ్యంలో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అత్యాధునిక సాంకేతికతో కూడిన ఆర్ఒ ప్లాంట్ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఆర్ఒ ప్లాంట్ గంటకు 500 లీటర్లు శుద్ధి చేస్తుందని వివరించారు. ఆర్ఒ ప్లాంట్ వితరణగా అందించిన ఇంటిలిజెన్స్ వైజాగ్ యూనిట్కు జూ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి లక్ష్మీపార్వతినగర్కు చెందిన ఎలకల గురునాయుడు (40) ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందడంతో ఆయన భార్య రేణుకకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలును కార్పొరేటర్ కెల్ల సునీత శనివారం అందజేశారు. మిగిలిన బీమా సొమ్మును మృతుని భార్య బ్యాంక్ అకౌంట్కు జమ చేయనున్నట్టు వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్చార్జ్ కెల్ల సత్యనారాయణ, బేత దుర్గారావు, శ్రీను పాల్గొన్నారు.

60 మందికి స్టీల్ కంచాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి కె.దిబ్బడిపాలెం ప్రాథమిక పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులకు సాయి సంహిత ఫౌండేషన్ ఆధ్వర్యాన స్టీల్ కంచాలు, గ్లాసులు శనివారం పంపిణీ చేశారు. ఎంఇఒ, కెవి.బాలామణి ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శశికాంతి, ఫౌండేషన్ అధ్యక్షులు, ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, సత్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు జెడ్పీ హైస్కూల్కు పలువురు పూర్వ విద్యార్థులు 11 నెక్ బ్యాండ్ పిఎ సిస్టమ్లను శనివారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుకు అందజేశారు. 6 నుంచి 10వ తరగతి వరకు హిందీ బోధించేందుకు టిఎస్వి.ప్రసాదరావు ఒక్కరే ఉండడంతో ఆయన విజ్ఞప్తి మేరకు విశ్రాంత ఉపాధ్యాయులు బి.గోపాలరావు, అతని వద్ద గతంలో చదువుకుని వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు రూ.35 వేలు విలువైన 11 నెక్ బ్యాండ్ పిఎ సిస్టమ్లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, నెక్ బ్యాండ్ సిస్టం ద్వారా హిందీ బోధన సులభతరం అవుతుందని తెలిపారు. ఉన్న ఒకే ఒక్క హిందీ ఉపాధ్యాయునిపై ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. సిస్టమ్ను అందజేసిన పూర్వ విద్యార్థులను అభినందించారు. ఇందుకు కారణమైన విశ్రాంత ఉపాధ్యాయులు గోపాలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిడి సంతోషి, ఎంపిటిసి సభ్యులు ఉండభట్ల ఆదిలక్ష్మి, ఎస్ఎంసి చైర్మన్ సరగడ రవి, విఆర్ఒ పి.శ్యామ్సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గీతం వర్సిటీకి ఐఇఇఇ అవార్డులు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచంలోని అతిపెద్ద వృత్తి నిపుణుల సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఐఇఇఇ విద్యార్థి విభాగాన్ని ఈ ఏడాది అత్యుత్తమ విభాగంగా గుర్తిస్తూ అవార్డును అందజేసింది. దీంతో పాటు విద్యార్థులను సాంకేతికంగా ప్రోత్సహిస్తు వృత్తి నైపుణ్యాలను పెంచడంలో కృషి చేస్తున్న స్టూడెంట్ బ్రాంచి కౌన్సిలర్, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ మహ్మద్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్టికి అత్యుత్తమ వాలంటీర్ అవార్డును, విద్యార్థి విభాగం అధ్యక్షుడు టి.పవన్ విగ్నేష్కు, బి.నిహారికలకు అత్యుత్తమ స్టూడెంట్ వాలంటీర్ అవార్డులను అందించింది. నిరంతరం కార్యక్రమాలతో పాటు నూతన సభ్యులను ప్రోత్సహించడం, విద్యార్థులలో ఐఇఇఇ పట్ల అవగాహన పెంచడం ద్వారా ఈ గుర్తింపు లభించినట్లు అవార్డు గ్రహీతలు తెలిపారు. వీరిని శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి. విజయశేఖర్, ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ జెబి. సెవెన్స్లు, సిఎస్ఇ విభాగాధిపతి ఆర్.శిరీష అభినందించారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను కార్పొరేటర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్కూలు కమిటీ చైర్మన్, వైసిపి నాయకులు బేత దుర్గారావు, పాండ్రంకి శ్రీను, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ కాంప్లెక్స్ను సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల కాంప్లెక్స్ సమీపంలో ఉన్న పౌల్ట్రీ కాంప్లెక్స్ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున శనివారం సందర్శించారు. 1984లో ఎన్టి.రామారావు హయాంలో సుమారు 30 మంది ఎస్సీలకు పౌల్ట్రీ ఫారాలను కేటాయించారు. అప్పటి నుంచి కొన్నేళ్లు వారు కోళ్ల పెంపకాలు సాగించారు. హుదూద్ తుపాను కారణంగా షెడ్లు, విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. కొంతమంది షెడ్లను మరమ్మతులు చేసుకోగా, మరికొన్ని షెడ్లు పూర్తిగా శిథిలమై ఉన్నాయి. ఈ షెడ్లలో మౌలిక సదుపాయాలు, విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించాలని ఇటీవల జిల్లా కలెక్టర్కు దళితులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి షెడ్లను సందర్శించారు. అక్కడున్న పరిస్థితులను తెలుసుకొని, మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పూర్తి సమాచారం సేకరించి నివేదిక ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ రామమూర్తి, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు బోనెల జోసెఫ్, ఆనందపురం తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ లవరాజు, దళిత సంఘం సీనియర్ నాయకులు సింహాద్రి రాంబాబు, చెన్న సత్యం, శంకర్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ కాంప్లెక్స్ దళిత రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

'ఆసరా' పంపిణీ



ఆసరా చెక్కును అందిస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలం సొంట్యాం గ్రామంలో 3వ విడత ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆసరా ద్వారా మండలంలో 1291 సంఘాల్లోని 13701 మంది సభ్యులకు రూ.10,45,03,489 చెక్కును అందించారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మహిళల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు మహిళాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రాంతపు నిత్యవసర వస్తువుల స్టాళ్లను ముత్తంశెట్టి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జి ముత్తంశెట్టి మహేష్, జడ్పిటిసి కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యనారాయణ, నాయకులు గన్రెడ్డి శ్రీను, బిఆర్బి.నాయుడు బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలి నాయుడు, బంటు చిన్న, పినిశెట్టి సింహాచలం నాయుడు, లంక రాంబాబు, రమేష్బాబు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: జివిఎంసి 98వ వార్డు సచివాలయ పరిధిలో గల డ్వాక్రా మహిళలకు సింహాచలం వరాహ పుష్కరిణిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను జగన్మోహన్రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. అనంతరం స్థానిక వైసిపి నాయకులు ఎర్రవరం బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఆయనతో తినిపించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లునాయుడు, వైసిపి నాయకులు లంక సత్తిబాబు, ఎన్.అప్పారావు, బి.శ్రీనివాసరావు, సాడి మధు, సిరిపురం కృష్ణ, దోమరోతు రాము తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో స్టాల్స్ కరువాయె...

పార్కింగ్‌కూ వినియోగదారుల అవస్థలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రైతు బజార్‌లో స్టాల్స్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే దుస్థితి ఏర్పడింది. వెహికల్స్ పార్కింగ్ ఏర్పాటు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. విశాఖ నగరంలో రెండో అతిపెద్ద రైతు బజార్లో సీతమ్మధారలో ఉంది. ఇక్కడ 300 మంది రైతులు ఉన్నారు. కానీ వారికి కేటాయించిన స్టాల్స్ మాత్రం 150 మాత్రమే ఉన్నాయి. స్టాల్స్ తక్కువ ఉండటంతో కొందరు ఆరుబయటే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కూరగాయలను విక్రయిస్తున్నారు. కొత్తగా రైతు బజారులో ఆర్గానిక్ స్టాల్‌ను ప్రారంభించడంతో ఆ స్థానంలో ఉన్న 10 మంది రైతులు స్థానాలను కోల్పోయారు. వారికి నేటికీ స్టాల్స్ కేటాయించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తెచ్చిన కూరగాయలు నిల్వ చేసుకున్న విధంగా స్టోరేజ్ లేకపోవడంతో అవి పాడైపోతున్నాయి. రైతు బజారు ఉన్నతాధికారులు తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులకు పార్కింగ్ లేకపోవడంతో రోడ్డు మీదే వాహనాలు నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఈ మార్గంలో ప్రజలు, వాహనదారులు ఎక్కువగా ప్రయాణాస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పండగ సమయాల్లో ఇక్కడ మరింత రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైతు బజార్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

దీనిపై ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబును ప్రజాశక్తి ప్రశ్నించగా రైతు బజార్‌కు ఉదయం 100 మంది, సాయంత్రం పూట 150 మంది రైతులు వస్తున్నారని తెలిపారు. రైతు బజారును అభివృద్ధి విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందన్నారు. మరి కొద్ది రోజుల్లో రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

స్టాల్స్ లేక ఎండలోనే అమ్ముతున్న రైతులు

గురుమూర్తిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాయల వెంకటరెడ్డి

గురుమూర్తిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి జన్మదిన వేడుకలు అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. 87వ వార్డు వైసిపి నాయకులు పెద్దఎత్తున ఆయన నివాసానికి వెళ్లి గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గురుమూర్తిరెడ్డి ఇటువంటి జన్మదిన వేడుకలు భవిష్యత్తులో మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, బోండా గోవిందరాజులు, దాసరి అప్పుడు, దాకా రాజగోపాల్, బుల్లెట్ రమణ, వి సన్యాసిరావు, ప్రగడ రాము, బడ్డ తాత, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన స్వగృహానికి ఆంధ్రప్రదేశ్ నారీటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ గురుమూర్తిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాహుల్ గాంధీపై వేటు పట్ల నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని వ్యతిరేకిస్తూ జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విన్నకోట రాము మాట్లాడుతూ, భారతదేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీపై పార్లమెంటులో అనర్హత వేటు వెయ్యడం బాధాకరమన్నారు. జిల్లా కాంగ్రెస్ నేత ఆర్ఆర్.నాయుడు మాట్లాడుతూ, 2024లో రాహుల్‌గాంధీ ప్రధాని అవ్వడం తథ్యమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం మతోన్మాద శక్తిని రెచ్చగొట్టడమే కాకుండా ఆదాని, అంబానీలకే అండగా ఉంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.విశ్వనాథం, ముక్క రామునాయుడు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామదేవత పండగ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి 41వ వార్షికోత్సవ పండగ మే 11 నుంచి 15వ తేదీ వరకు జరిపేందుకు నిర్ణయించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నమ్మి గౌరేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సినీ ఆర్టిస్ట్ పొట్టి మూర్తి విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌరవాధ్యక్షులు గాలి సన్యాసిరావు, అడ్వకేట్ కోలా వెంకటరమణ, ఆలయ ధర్మకర్త నమ్మి అచ్చియమ్మ, ఆలయ గౌరవాధ్యక్షులు రంగుభుక్త అప్పలరాజు, అధ్యక్షులు గండేపల్లి షణ్ముఖ గురునాధరావు, సెక్రటరీ జగ్గయ్యమ్మ శీను, కమిటీ సభ్యులు ఎదురు శ్రీనివాసరావు, ఓయిబోయిన గిరిష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ'లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో మెడికవర్ ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు బిపి, సుగర్, ఇసిజి తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. వ్యాయామం, క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ శివకుమార్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరునాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లతో కెకె.రాజు సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : షాదీఖాన కళ్యాణ మండపంలో జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిలు, సచివాలయ కన్వీనర్లతో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని, దాని దృష్టిలో ఉంచుకొని సమిష్టిగా పనిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా, లేదా పరిశీలించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు చంద్రబాబుతోనే కాకుండా కొన్ని పచ్చ మీడియా కూడా మనం పోరాడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలి

జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. శ్రీనగర్‌లోని ఆపిల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాణించాలని కోరారు. స్కూల్ చైర్మన్ టి.బలరామకృష్ణ మాట్లాడుతూ, తమ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కూడా బహుమతులు సాధిస్తున్నారని తెలిపారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అన్నారు. డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ప్రమీల ముఖర్జీ పాల్గొన్నారు.

'సర్పంచులు విద్యుత్ బిల్లులు చెల్లించొద్దు'

ప్రజాశక్తి-సీతమ్మధార : సర్పంచులు విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైబి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర సర్పంచుల ముఖ్య నాయకులతో శనివారం పౌరగ్రంథలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. పంచాయతీ నిధులు కాజేయడమంటే గ్రామీణ ప్రజలను దోచుకోవడమేనని పేర్కొనానరు. వివిధ పథకాల ద్వారా పంచాయతీలకు వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందకుండా చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.6,660 కోట్లును రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. సర్పంచులకు గౌరవ వేతనం రూ.15వేలు, ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలు నిధులు సర్పంచుల ద్వారా ఖర్చు చేయాలని కోరారు. గ్రామాల్లో కనీసం నీటి సదుపాయం లేదని, డ్రెయినేజీలు, బోర్లు రోడ్లు దుస్థితి చాలా దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు.

రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ, వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సర్పంచుల ద్వారా ఖర్చు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రతినిధి పి.నరేంద్ర, వివిధ జిల్లాల గ్రామ సర్పంచులు, పంచాయతీరాజ్ నాయకులు పాల్గొన్నారు.

ఆరుష్ గ్రూపు ప్రాజెక్టులు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్య, వ్యవసాయ రంగంలో సరికొత్త టెక్నాలజీలో కూడిన ప్రాజెక్టులను ఆరుష్ గ్రూప్ ఆవిష్కరించింది. విశాఖ శాంతిపురంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అత్యాధునిక సాంకేతికతో కూడిన ఆరుష్ గ్రూప్ మూడు ప్రాజెక్టులను నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు, డిప్యూటీ మేయర్ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వ్యవసాయం, వైద్యం, ఎడ్‌టెక్ ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో నాలుగు ఎంఒయులు చేసుకున్నట్లు కంపెనీ ప్రతినిధులు వివరించారు. హెల్త్ కేర్, ఆరుష్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, అగ్రికల్చర్‌కు సంబంధించి ఎంఒయులు జరిగినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి ఆంధ్రప్రదేశ్‌లో కిసాన్ కర్షక మిత్ర అగ్రికల్చర్ ప్రాజెక్టు ద్వారా సుమారు 2 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో సరికొత్త టెక్నాలజీతో సాఫ్ట్ వేర్ రూపొందించామని, మినీ హెల్త్ కేర్ కిట్ ద్వారా ఇంటి వద్దనే కేవలం 30 నిమిషాల్లో.. 53 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించేలా డిజైన్ చేశామని వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖ నగరంలో 60 వార్డుల్లో దీన్ని ప్రారంభించబోతున్నామని చెప్పారు. 300 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, 250 మందితో కాల్ సెంటర్ సర్వీస్ కూడా ప్రారంభించామని ఆరుష్ గ్రూప్ డైరెక్టర్ సుభాష్ తెలిపారు.

మాట్లాడుతున్న కెకె.రాజు, కంపెనీ ప్రతినిధులు

బొట్టా ఈశ్వరమ్మకు మాతృ వియోగం

ప్రజాశక్తి- కంచరపాలెం : సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ తల్లి కొయ్య చెల్లయమ్మ (82) శనివారం రాత్రి 7.45 సమయంలో ఆమె నివాసంలో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు కుమారుడు కొయ్య నాగేశ్వరరావు, కుమార్తె బొట్టా ఈశ్వరమ్మ ఉన్నారు. చెల్లయ్యమ్మ మృతిపట్ల సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సంతాపం తెలిపారు.

త్రో బాల్ పోటీలో కాంస్యం

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల జరిగిన జాతీయ స్థాయి జూనియర్ త్రో బాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన విద్యార్థులకు వైసిపి నాయకులు శనివారం అభినందనలు తెలిపారు. గాజువాక మండలం కణితి హైస్కూల్ విద్యార్థినులు సిహెచ్ సునీత, ఎం.తేజశ్రీ, ఎస్.సాయిలిఖిత, డి.చందన, డి.చెర్రిష, ఎస్.రిషిత అత్యంత ప్రతిభ కనబరిచారు. వారిని కణితి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సూర్యప్రకాష్, ఎ.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, పీటీ మున్నాజీ, 87వ వార్డు వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు తదితరులువిద్యార్థినులను అభినందించారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నరవ గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్ ప్రారంభించారు. వివిధ స్లోగన్‌లతో కూడిన ప్లకార్డులతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నరవ గ్రామంలో ఉన్న షాపుల వద్ద వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చిటిమిరెడ్డి వీరునాయుడు, వివిధ విభాగాల అధ్యాపకులు, సివిల్ విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆసరా' చెక్కుల పంపిణీ

చెక్కును విడుదల చేస్తున్న రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల బంగారురాజు కల్యాణ మండపంలో శనివారం వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ విడుదల చేశారు. అనంతరం ఎంపిపి గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి మండలంలో 19 వేల మంది డ్వాక్రా మహిళలకు సుమారు 14 కోట్ల రూపాయలు రుణమాఫీగా అందజేయడం జరిగిందని తెలిపారు. 2024 ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు భీశెట్టి వరాహ సత్యవతి, డిఆర్డిఎ పథక సంచాలకులు లక్ష్మీపతి, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు జోసెఫ్, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి శేఖర్, తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు కన్నారావు, వైసిపి నాయకులు మల్ల బుల్లిబాబు, వెంకటలక్ష్మి, భారతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలో ఆసరా ఆసరా నిధులు రూ.10.43 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు శనివారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అందజేశారు. అనంతరం ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో ఇంటి వద్దకే వైద్య సేవలు అందించే విధంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కలెక్టర్ రవి పఠాన్ శెట్టి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 34,935 సంఘాలకు 296.77 కోట్లు ఆసరా ద్వారా మహిళలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఈర్లె అనురాధ, పకృతి బాబురావు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చయ్యపేట : మండలంలోని దిబిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్వాక్రా సంఘాల సభ్యులకు చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ శనివారం స్థానిక నాయకులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 1297 డ్వాక్రా సంఘాలకు రూ.7.64 కోట్లు మూడో విడతలో అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి, జెడ్పిటిసి దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, ఎంపీడీవో సువర్ణరాజు, తహశీల్దార్ ఎస్‌వి అంబేద్కర్, ఏపీఎం వై.బాలరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళలు

పౌర హక్కులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రతి నెలలో చివరి రెండు రోజులు పౌర హక్కుల దినోత్సవాలను నిర్వహించి పౌరు హక్కులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సభ్యుల కోరికపై న్యాయ పరిభాష పదాలపై వర్క్ షాపు నిర్వహించాలన్నారు. జిల్లాలో నమోదైన, పరిష్కరించిన, విచారణలో ఉన్న పిటి కేసులపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా సమీక్షించారు. సమావేశంలో ఎస్పీ గౌతమి సాలి, జెసి కల్పనకుమారి, డిఆర్వో వెంకటరమణ, సోషల్ వెల్ఫేర్ ఏడి అజయ్ బాబు, అనకాపల్లి నర్సీపట్నం ఏఎస్పీలు, కమిటీ సభ్యులు ప్రభాకర్ రావు, శిరీష రాణి, ఇంద్రావతి, అప్పలరాజు, మరియమ్మ, అప్పారావు, ఈశ్వరరావు, తరుణ్ కుమార్, వెంకటరమణ, మధుబాబు పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక తహశీల్దార్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం ఎస్‌సి కాలనీలో సివిల్ రైట్స్ డే సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల పట్ల ఎవరైనా వివక్ష చూపినా, వారిని వేధించినా చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ పి.రంగనాథం, ఎంపీడీఓ రమేష్ నాయుడు, సర్పంచ్ బోకం స్వామి నాయుడు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను తినాలని మండలంలోని చీమలపల్లి, కొండకర్ల, హరిపాలెం గ్రామాల్లో శనివారం విద్యార్థులు ర్యాలీ చేశారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ఫౌండేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ ఎం హారిక చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సియాద్రి నాగనూకరాజు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, అంగన్వాడీ టీచర్‌లు కాంతమ్మ, లక్ష్మి నారాయణమ్మ, సావిత్రి, పోషణ సఖి మౌనిక, సంతోషి, శివ లక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యమైన పండ్ల ఉత్పత్తితో లాభాలు

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు

మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో రైతులు నాణ్యమైన పండ్ల ఉత్పత్తి చేపట్టి అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి ప్రభాకర్ రావు తెలిపారు. శనివారం కింతాడ గ్రామంలో మామిడి రైతులతో సమావేశమై పండ్లకు రక్షణ కలిగించే కాగితపు సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పండ్లతోటల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిమ్మకాయ పరిమాణంలో ఉన్న మామిడికాయలను ఎంపిక చేసుకుని ఫ్రూట్ కవర్లు తొడగాలన్నారు. కాయలకు ఎటువంటి తెగుళ్ళు సోకకుండా మంచి నాణ్యమైన పండ్ల దిగుబడికి ఈ సంచులు తోడ్పడతాయని చెప్పారు. ఈ విధంగా మగ్గిన పండ్లకు మార్కెట్లో మంచి ధర పలుకుతుందన్నారు. ప్రస్తుతం రైతులు కాయ రంగు పెంచేందుకు రకరకాల కార్బైడ్ రసాయనాలు వాడుతున్నారని, వాటి వల్ల ప్రజలకు ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. జిల్లాలో 400 మంది రైతులను ఎంపిక చేసి రెండు వందల ఎకరాల్లో ప్రయోగాత్మకంగా కాగితపు సంచులను 50 శాతం రాయితీపై పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు కిరణ్మయి, గణేష్, స్థానిక వ్యవసాయ అధికారి సోమశేఖర్, సర్పంచ్ బండారు ముత్యాల నాయుడు, ఉద్యానవన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు

వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాల వివరాల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపల రవాణా వాహనాలకి 40 శాతం రాయితీపై పిఎంఎంఎస్‌వై పథకంలో సరఫరా చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. తుంపర సేద్యం పరికరాలను అందజేసేందుకు రైతు భరోసా కేంద్రం స్థాయిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు చిక్కాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న రాయితీలు, విత్తనాలు, శాస్త్రీయ వంగడాల సరఫరా పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల అపహరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలం చౌడువాడ గ్రామంలో శనివారం రాత్రి రెండు బుల్లెట్ మోటారు సైకిళ్లను దొంగలు అపహరించారు. స్థానిక పాత్రికేయుడు శిలపరశెట్టి వెంకటరావుకు చెందిన బుల్లెట్ బండి, అక్కడకు దగ్గర్లో ఉన్న లావైట్ రాజు ఇంటి వద్ద ఉంచిన మరొక బుల్లెట్ బండిని దొంగలు ఎత్తుకెళ్లడంతో గ్రామంలో కలకలం రేగింది. వీటిని కొద్ది దూరంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశం వరకు నడిపించుకుని వెళ్లి, అక్కడ నెంబర్ ప్లేట్లను విరగ్గొట్టి వాటిని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ధనుంజయ తెలిపారు.

చిన్న పరిశ్రమలకు వరం ఎఫ్‌ఎఫ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి-అనకాపల్లి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, అధికారులు

జిల్లాలో ఏర్పాటు చేయబోయే ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ చిన్న పరిశ్రమలకు వరమని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి వెల్లడించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమలు ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడూరు ఇండస్ట్రియల్ పార్కులో ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించాలని ఆర్డీవో చిన్నకృష్ణను ఆదేశించారు. బహుళ అంతస్తుల కాంప్లెక్స్‌లో చిన్న పరిశ్రమల స్థాపనకు స్థలాలను కేటాయించడం జరుగుతుందని, దీనివల్ల పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కంపెనీలకు సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను జీవీఎంసీ జలవిభాగం ఇంజనీర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పి వెంకటరమణ, ఏపీఐఐసీ జెడ్ త్రినాధ్, డీఐసి జనరల్ మేనేజర్ శ్రీధర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి వెంకటేశ్వర్లు, ఫ్యాక్టరీల డిప్యూటీ చైర్మన్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, డిఆర్డిఎ పిడి లక్ష్మీపతి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మోహన్ రావు, జిల్లా అగ్నిమాపక దళ శాఖ అధికారి లక్ష్మణస్వామి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

3 నుండి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి- సబ్బవరం : ఈ నెల 3వ తేదీ నుండి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఒంటి పూట బడులు నిర్వహించాలని సిఎస్‌ఈ వారు ఉత్తర్వులు విడుదల చేసినట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు ఉదయం 7.45 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని పేర్కొన్నారు. టెన్త్ పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్ష రోజులలో (మొత్తం ఆరు రోజులు) తరగతులు ఉండవని తెలిపారు. ఈ పాఠశాలలు ఈ నెల 3 నుండి 30వ తేదీ మధ్యలో ప్రభుత్వ సెలవు దినాలలో ఆరు రోజుల పాటు కంపెన్సటరీ క్లాసులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు స్టీల్ గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొటాన రాంబాబు తన తండ్రి సన్నిబాబు జ్ఞాపకార్థం సన్నిబాబు ట్రస్ట్ పేరుతో పాఠశాలల విద్యార్థులకు స్టీల్ గ్లాస్‌లను సమకూర్చారు. వీటిని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ రవీంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.నాగమణి చేతుల మీదుగా శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నాగయ్యపేట, చంద్రయ్యపేట, కాశీపురం యూపీ, హైస్కూల్ విద్యార్థులకు 150 స్టీల్ గ్లాసులు పంపిణీ చేసినట్లు చెప్పారు. 10వ తరగతి విద్యార్థులకు హిందీ మాస్టారు శ్రీను, ఇంగ్లీష్ టీచర్ సునీత పరీక్షలకు ఉపయోగపడే మేథమెటికల్ బాక్స్, పెన్ను సెట్‌లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ ఆదిరెడ్డి ఈశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లాసులు అందజేస్తున్న ఎంఇఒ రవీంద్రబాబు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపుపై స్పందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణ నడిబొడ్డున ప్రజలకు అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణానికి దూరంగా జాతీయ రహదారిపై మార్చడంపై ప్రజాప్రతినిధులు స్పందించాలని అర్బిన ఉద్యమకర్త కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం మంత్రులు, పార్లమెంటు సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ప్రజల సొమ్ముతో జీతభత్యాలు, పింఛన్లు, ఇతర సదుపాయాలు పొందుతున్నారని, ఈ నేపథ్యంలో వారు ప్రజలకు జవాబుదారులని పేర్కొన్నారు. అందువల్ల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంట శ్రీనివాసరావు, మాజీ పీలా గోవింద సత్యనారాయణ, త్వరితగతిన స్పందించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపును నిరోధించాలని కోరారు. ఈ కార్యాలయాన్ని ఏకపక్షంగా ప్రమాదాలకు నిలయమైన జాతీయ రహదారిపైకి మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలం మర్రివలస గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారి పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని స్థానిక నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం తిలకించి కళాకారులను అభినందించారు. పండగ సందర్భంగా అన్న సంతర్పణకు తన వంతుగా రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కన్నూరు సత్యనారాయణ, కన్నూరు పోతన్న, కొచ్చెర్ల అశోక్, కన్నూరు సన్యాసి నాయుడు, పొంతపల్లి ఈశ్వరరావు, మాడిన చిన దేముళ్ళు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో ప్రజలకు బురద నీరు

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లిలో గత కొన్నేళ్లుగా బురద నీరు ప్రజలు తాగాల్సి వస్తోందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అమర్నాథ్ దష్టికి, జీవీఎంసీ అధికారుల దష్టికి ఎన్నిసార్లు సమస్యను తీసుకెళ్లిన పరిష్కారం కాలేదన్నారు.

కూలి రేట్లు పెంచాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కంప్రెసర్, క్రషర్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని, 11వ వేతన ఒప్పంద చర్చలకు క్రషర్ క్వారీ యాజమాన్యాలు ముందుకు రావాలని ఏఐటియుసి జిల్లా నాయకులు కోన మోహనరావు డిమాండ్ చేశారు. బొలువాడ డిల్లర్స్ కాలనీలో శనివారం అనకాపల్లి జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ వేతన ఒప్పంద గడువు ముగిసి నెల రోజులు కావస్తున్నా యాజమాన్యాలు ముందుకు రాకపోవడం దారుణం అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఎస్. అప్పలనాయుడు, సేనాపతి సూర్యారావు, దాడి జగ్గారావు, ఏ సుభాష్, సిహెచ్ రమేష్, పుల్లేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

5న జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలోని గుల్లం జాషువ కాలనీలో బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలను ఈ నెల 5న ఆవిష్కరించనున్నట్లు విగ్రహాల నిర్మాణ కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కట్టుమూరి మంగ రాజు, కొల్లి చిన్న అప్పారావు, కమిటీ సభ్యులు వైరల అప్పారావు, కొల్లి రాంజీ, చెవ్వేటి నాగరాజు, చేవ్వేటి ప్రకాష్, కొల్లి రమణ పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- అనకాపల్లి : హాస్టళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. తుమ్మపాల పంచాయతీ పరిధిలోని గుండాల వీధి గాంధీనగరం బాలుర బాలికల వెనుకబడిన తరగతుల హాస్టళ్లలో 500 లీటర్ల సామర్థ్యం గల రెండు లక్షల 50 వేల విలువ చేసే రెండు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లను శనివారం ఆయన ప్రారంభించారు. గతంలో ఈ హాస్టల్స్ సందర్శనకు వచ్చిన నేపథ్యంలో విద్యార్థులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన ఎంపీపీ నిధుల నుంచి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, హాస్టల్ వార్డెన్ సురేష్, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బంధం అప్పలనాయుడు, కోడూరు వైసిపి గ్రామ అధ్యక్షులు సేనాపతి శ్రీనివాసరావు, కరణం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలులో ఉత్తరాంధ్రలో ప్రథమ స్థానం

మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి

ప్రజాశక్తి - యలమంచిలి

ఇంటి పన్నుల వసూలులో యలమంచిలి మున్సిపాలిటీ ఉత్తరాంధ్రలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ ఇంటి పన్నుల లక్ష్యం రూ.3.7 కోట్లు కాగా, రూ.2.91 కోట్లు వసూలు చేయడం జరిగిందని వెల్లడించారు. విశాఖ రీజియన్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 9 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలు ఉండగా, యలమంచిలి మున్సిపాలిటీలో పన్నులు 94.78 శాతం వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇంటిపన్నులు కాక ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలపై రూ.25 లక్షల పన్నులు వసూలు చేయడం జరిగిందన్నారు. ఇవన్నీ కలిపి మున్సిపాలిటీ మొత్తం పన్ను వసూలు రూ.3.16 కోట్లకు చేరిందని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లోని 123 మున్సిపాలిటీల్లో యలమంచిలి 20వ స్థానం కైవసం చేసుకోవడం సంతోషదాయకమన్నారు. రికార్డ పన్ను వసూళ్లకు పాలకవర్గం ఎంతో సహకరించిందని కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ నీలిమ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి

మాట్లాడుతున్న ఎంపిపి కలగా లక్ష్మి, చిత్రంలో జెడ్‌పిటిసి తదితరులు

ప్రజాశక్తి - కశింకోట

గ్రామాలు అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని, అప్పుడే మండలం అభివృద్ధి అవుతుందని మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల అందిస్తున్నామన్నారు. చెరకం సర్పంచ్ దేవుళ్ళు మాట్లాడుతూ సుమారు 280 ఎకరాలు భూ సర్వే అవ్వలేదని తెలిపారు. తీడ సర్పంచ్ చిరిక సత్యనారాయణ మాట్లాడుతూ కన్నూరుపాలెం, తోటకూరపాలెం తారు రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఉగ్గిన పాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి మాట్లాడుతూ సంపత్ పురం సుజన స్రవంతి తాగునీరు బురద మట్టితో వస్తుందని తెలిపారు. సంబంధిత అధికారులు మాట్లాడుతూ బురద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మెసయ్యపేట సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నాటుసారా అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, నమ్మి మీనా, ఎమ్‌పిడిఒ కొంకి అప్పారావు, ఇన్‌ఛార్జ్ తహశీల్దారు సురేష్ నాయుడు, ఎమ్ఇఒ చిట్టి బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రిలో ఎన్విరాన్‌మెంట్ మానిటరింగ్

ప్రజాశక్తి -పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రి పరిసర గాలి నాణ్యతను అత్యాధునిక కాలుష్య నియంత్రణ సాంకేతిక పరికరాలను ఉపయోగించి వివిధ పరిమితుల గడియారం ప్రాతిపదికన శనివారం పర్యవేక్షణ చేపట్టారు. అదనంగా గాలి, భూగర్భ జలాలు, ప్రసరించే నీటి నియంత్రణ పరిమితులు ప్రతి 15 రోజులకు ఇంటిలో, ఎన్ఎబిఎల్ గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ లేబొరేటరీల ద్వారా విశ్లేషించబడుతున్నాయని, అదే సమ్మతిగా చట్టబద్ధమైన సంస్థలకు సమర్పించబడుతుందని అధికారులు తెలిపారు. ప్రారంభ డేటాతో (అంటే 10-12 సంవత్సరాల క్రితం) పోల్చినప్పుడు, సమీపంలోని గ్రామాల గాలి, నీరు, నేల నాణ్యతపై ఎటువంటి ప్రతికూల ప్రభావం లేదని స్పష్టమవుతుందని వెల్లడించారు. మానవ ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర అధ్యయనం 2021లో పూర్తయిందని, ప్రజలు, పశువులపై పవర్ ప్లాంట్ ఆపరేషన్ కారణంగా ఆరోగ్యానికి సంబంధించిన ఎటువంటి ప్రమాదం, అనారోగ్యాలు లేవని కనుగొన్నట్లు సూచిస్తున్నాయని తెలిపారు.

ఎన్‌టిపిసి ఏర్పాటు చేసిన ఎన్విరాన్‌మెంట్‌మానిటరింగ్ సిస్టమ్

'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని అనాధ బాలలకు మిషన్ వాత్సల్య పథకం కింద దరఖాస్తులను సేకరిస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద నెలకు రూ.4వేలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కుటుంబ సంవత్సరాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణంలో రూ.96 వేలు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికేట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆదాయ ధ్రువీకరణ, బ్యాంకు ఎకౌంటు నెంబర్, ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, మరణానికి గల కారణం, గార్డియన్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు జత చేయాలని సూచించారు. తల్లిదండ్రులు లేని అనాధలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడే తల్లిదండ్రుల పిల్లలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పాక్షిక అనాధలు, విడాకులు తీసుకున్న తల్లిదండ్రులు ఉన్నవారు, ప్రకృతి వైపరీత్యానికి గురైన, యాచకులైన, బాల్యవివాహాలు జరిగిన బాధిత పీడిత పిల్లలు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి, లేదా తమ సమీప అంగన్వాడీ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలంలోని ఫార్మాసిటీలోని యుజిఎస్ (స్టైరెడ్స్) కంపెనీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో మరణించిన ఎస్.రాయవరం మండలం, బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన కార్మికుడు ఉమ్మిడి వెంకటేష్ (32) కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భద్రత వైఫల్యం, ప్రతి ఆరు నెలలకు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం వంటి కారణాల వల్ల కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటేష్ మృతిపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, లేబర్ డిపార్ట్మెంట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుడు కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు.

రాష్ట్రంలో ఉపాధి కల్పన శూన్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించలేని దుస్థితిలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 33 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. సీఎంఐఈ గణాంకాల ప్రకారం 2016 -19తో పోలిస్తే 2019- 23లో ఉపాధి లభించిన వారి సంఖ్య 22 లక్షలకు తగ్గిందని పేర్కొన్నారు. ఉపాధి ఉద్యోగాలు లేక నిరాశ చెందిన వారు ఈ మూడేళ్లలో 21,571 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం చెప్పిన జగన్ రెడ్డికి చీమకుట్టినట్టైనా లేదని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ బాబర్, జిల్లా అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు, జిల్లా కార్యదర్శి కుప్పిలి జగన్మోహన్, టిఎన్టియుసి జిల్లా కార్యదర్శి బుద్ద భువనేశ్వర్ పాల్గొన్నారు.

కల్యాణమస్తు చెక్కు అందజేత

ప్రజాశక్తి- అనకాపల్లి : ఇటీవల వివాహమైన వేల్పుల పుణ్యవతి ప్రసాద్ దంపతులకు కళ్యాణమస్తు పథకం కింద మంజూరైన రూ.50 వేల చెక్కును జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు శనివారం అంబేద్కర్ నగర్ 23వ సచివాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైయస్సార్ కళ్యాణమస్తు పథకం ఎంతోమంది పేదలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ జి సతీష్, వెల్ఫేర్ సెక్రెటరీ బి ఈశ్వరరావు, విల్లూరి శేఖర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని అచ్చర్ల గ్రామ సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు అన్నారు. అచ్చర్ల సచివాలయం వద్ద శనివారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వివిధ రకాల వంటకాలు, కూరగాయలు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మదల రమేష్ అంగన్వాడీ కార్యకర్తలు కమల, నాగమణి, సత్యవతి, లలిత గర్భిణీ బాలింతలు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ఎంపీడీఓ రమేష్ నాయుడుకు పలువురు నేతలు శనివారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ఎంపీడీఓకు పూలగుచ్చాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనకు బోకేలు అందజేశారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిందరికీ ఎంపిడిఒ ధన్యవాదాలు తెలిపారు.

ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపిపి, జెడ్‌పి వైస్ చైర్మన్

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈనెల 3వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరగనున్న టెన్త్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ డివిడి ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1385 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గురుకులం పాఠశాల, గురూస్ స్కూల్, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాణి లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

కొత్తకోట:రావికమతం మండలంలో ఈ నెల 3వ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఒ ఎన్.జయలక్ష్మి తెలిపారు. మండలంలో ఐదు సెంటర్లు ఏర్పాటు చేశామని, 997 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కొత్తకోట జడ్పీ హైస్కూల్లో 245 మంది, దొండపూడి హైస్కూల్లో 235 మంది, మరుపాక ఏపీ మోడల్ స్కూల్లో 202 మంది, రావికమతం గర్ల్స్ హైస్కూల్లో 117 మంది, రావికమతం జడ్పీ హైస్కూల్లో 198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బెంచీలు, విద్యుత్, ఫ్యాన్లు, తాగు నీరు, వైద్యసేవలు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఒ తెలిపారు.

రూములను కేటాయిస్తున్న అధికారులు

గొలుగొండ: మండలంలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏఎల్ పురం, చీడిగుమ్మల జిల్లా పరిషత్ హైస్కూళ్ళు, గొలుగొండ గురుకుల కళాశాలలు పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. మండలంలోని మూడు కేంద్రాలలో 579 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గొలుగొండ గురుకుల కళాశాలలో 252 మంది, చీడిగుమ్మల హైస్కూల్లో 133 మంది, ఏ ఎల్ పురం హైస్కూల్లో 194 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

'మిషన్ వాత్సల్య'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ నర్సీపట్నం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ, అనాధల బాలబాలికలకు, విడాకులు పొందిన తల్లిదండ్రుల పిల్లల, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా ఎటువంటి సహాయ సహకారాలు పొందని బాల బాలికలకు కేంద్ర ప్రభుత్వం రూ.4వేలు అందిస్తుందని తెలిపారు.ఎంపికైన బాలబాలికలకు నెలకు రూ.4 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. ఈ పథకం కోసం ఏప్రిల్ 15వ తేదీ లోపు అంగన్వాడీ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

7 నుండి 'జగనన్నే మా భవిష్యత్ '

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 7 నుండి చేపట్టే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభం చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. శనివారం వైయస్సార్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు గృహ సారథులు, కన్వీనర్లు, ముఖ్య నాయకులు పాటుపడాలని పిలుపునిచ్చారు. గత నెలలోనే జరగాల్సిన ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ కోడ్ కారణంగా ఆగిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి నాయకులు వెళ్లాలని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రజలకి తెలియజేయాలని కోరారు.

వెలుగుతున్న సోలార్ దీపం

గ్రామాల్లో సోలార్ దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన ప్రాజెక్టులో భాగంగా మండలంలో 79 సోలార్ ల్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని మండల టెక్నికల్ అధికారి టి.పద్మారావు తెలిపారు. ప్రతీ పంచాయతీలో మూడు చొప్పున సోలార్ ల్యాంపులు వేస్తున్నామన్నారు. ఈ పనులు ఇప్పటికే దాదాపు అన్ని పంచాయతీల్లో పూర్తయ్యాయన్నారు. కరెంట్ లేకపోయినా గ్రామాల్లో వెలుగు ఉండాలనే ఉద్దేశ్యంతో సోలార్ లైట్లు ప్రభుత్వం వేస్తుందన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక (లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం) శివాలయంలో శివ, పార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు శనివారం సాయంత్రం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమ య్యాయి. ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శివాలయం అర్చకులు మహేశ్, వేద పండితుల ఆధ్వర్యంలో అంకురార్పణ, హోమాలు, ధ్వజారోహణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి నక్కపల్లిలో శింగంశెట్టి నానీ కుటుంబీకుల ఆధ్వర్యంలో వారి నివాస గృహం వద్ద ఎదురు సన్నాహమహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీ దేవి పార్వతీ పరమేశ్వరులు పెండ్లి చూపులు, పెండ్లిమాటలను భక్తులకు వివరించారు. గాయత్రీదేవి ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టు కున్నాయి. అనంతరం శింగంశెట్టి నానీ కుటుంబీకుల ఆధ్వర్యంలో గాయత్రీదేవిని ఘనంగా సత్కరించారు. ముందుగా ఉపమాక శివాలయం నుండి కోలాట ప్రదర్శనతో శివపార్వత ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ ఎదురు సన్నాహ మహోత్సవ కార్యక్రమానికి తీసుకువెళ్లారు. ఆలయ ఛైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఇన్స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఈవో మురళి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు .

ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహిస్తున్న గాయత్రీదేవి

ఊరేగిస్తున్న మహిళా భక్తులు

ఘనంగా రాములోరి పెళ్లి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక గచ్చపు వీధిలోని రామాలయంలో రాములోరి పెళ్లి మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. హిందూ సాంప్రదాయ ప్రకారం కళ్యాణ ఘట్టం మూడు రోజులు నిర్వహిస్తారు. ఈ ప్రకారంగానే గచ్చపు వీధిలో స్థానికుల సహాయ సహకారాల తో కొరుపోలు అప్పలరాజు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా రాములోరి పెళ్లిని ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు శనివారం వీధిలో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. నిర్వాహకులు అప్పలరాజు మీడియాతో మాట్లాడుతూ, పూర్వం ఈ రామాలయం చిన్నపాటి గుడిసెలో ఉండేదని, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సహకారంతో అతిపెద్ద రామాలయంగా పున్ర నిర్మాణం చేపట్టామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మాట్లాడుతున్న ఎంపిడివో

ప్రజాశక్తి-నక్కపల్లి:జగనన్న లేఅవుట్లలో వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ నీరజ, హౌసింగ్ ఏఈ రాజులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గృహ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే పనులు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణాలు పూర్తయిన గృహాలకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. లే అవుట్లలో రహదారుల సౌకర్యం, ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ నాగభూషణం, ఎలక్ట్రికల్ ఏఈ కృష్ణ, పంచాయతీరాజ్ వర్క్ ఇన్స్పెక్టర్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి

కోటవురట్ల:మండల కేంద్రంలో నిర్మితమవుతున్న జగనన్న కాలనీలను మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ శనివారం సందర్శించారు. బీసీ కాలనీ మహాలక్ష్మి ఆలయం వద్ద కాలనీలను సందర్శించి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు బిల్లుల చెల్లింపుపై ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఇఒపిఆర్‌డి ప్రేమ్ కుమార్, పంచాయితీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

భూ వివాదంలో మహిళపై దాడి

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని పాకలపాడు పంచాయతీలో భూ వివాదం చోటుచేసుకుని ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ సంఘటనలో మూకల సూర్యనారాయణమ్మపై అల్లు వెంకటరమణ అనే వ్యక్తి కర్రతో దాడి చేశాడని గ్రామస్తులు తెలిపారు. పూర్వీకుల ఉమ్మడి భూమికి ఇరువురు తగాదా పడినట్లుగా గ్రామస్తులు తెలిపారు. గాయపడిన సూర్యనారాయణమ్మను నర్సీ పట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

గాయపడి మహిళ

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -గొలుగొండ:వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో సాగనంపాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని పుత్తడిగైరంపేట, పాకలపాడు గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సభల్లో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైసిపి పాలనలో ఏ వర్గానికి చెందిన ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కడమే పనిగా పెట్టు కుందన్నారు. ప్రభుత్వ పాలనను ప్రశ్నించినందుకే తనపై అక్రమ కేసులకు పూనుకున్నారని, ఎన్ని కేసులు పెట్టుకున్నా భయపడేది లేదన్నారు. రాష్ట్రం బాగు కోసం మళ్లీ తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జి, చోద్యం సర్పంచ్ కొల్లు రాంబాబు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లు సత్తిబాబు, స్థానిక నాయకులు రూపాల నాయుడు, నారాయణమూర్తి, కామిరెడ్డి రామన్న, బొడ్డు సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

రైల్వే స్టేషన్‌లో నాయకులు

చలో ఢిల్లీకి తరలివెళ్లిన కార్మికులు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఈ నెల 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖపట్నం నుంచి కార్మికులు శనివారం బయలుదేరి వెళ్లారు. వీరిలో భవన నిర్మాణ కార్మికులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు ఎక్కువ మంది ఉన్నారు. వారికి సిఐటియు జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. ఢిల్లీకి తరలివెళ్లిన వారిని ఉద్దేశించి రైల్వే స్టేషన్ వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పబ్లిక్ రంగంలోనే కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, సర్వీసుల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. చలో ఢిల్లీ నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు తులసి, అప్పలరాజు, అనసూయ, నాయకులు బి.వెంకటరావు, శంకరరావు, దేవి, బృంద, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోహన్‌రావు

ఇకెవైసి చేయించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి -నక్కపల్లి :ఈకేవైసీ నమోదు కాని రైతులను గుర్తించి వెంటనే చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు ఆర్‌బికె సిబ్బందికి సూచించారు. నక్కపల్లిలో శనివారం రైతు భరోసా కేంద్రంలో ఆర్.బి.కె సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో పిఎం కిసాన్ 14564 లబ్ధిదారులకు అందుతుందని, సుమారుగా 2,017 రైతులు ఈకేవైసీ నమోదు చేయించకపోవడంతో వారికి లబ్ధి అందలేదన్నారు. వెంటనే ఆర్‌బికె సిబ్బంది వాలంటీర్ల సాయంతో ఈకేవైసీ నమోదు కాని రైతులకు చేయించాలని సూచించారు. పీఎం కిసాన్ లబ్ధి రైతులందరికీ అందాలని, రైతులు వేసవిలో చిరు ధాన్యాలు వేసుకునేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. ఖరీఫ్‌లో వేస్తున్న పంటలు క్రాప్ బుకింగ్ ప్రణాళిక వేసుకోవాలన్నారు. కియాస్క్, పనితీరు, వైఎస్ఆర్ యంత్ర సేవపై ఆర్‌బికె సిబ్బందికి అవగాహన కల్పించి, పక్కాగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి ఎస్ రాజ్ కమల్, ఏవో ఉమా ప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సును ఏర్పాటు చేసిన ఉమానారాయణ

ఆర్‌టిసి బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం ఆర్టీసీ డిపో పరిధిలోని 150 బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లను చిన్నపిల్లల వైద్య నిపుణులు పుల్లేటికుర్తి మల్లికార్జునరావు సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఏ సమయంలోనైనా ప్రథమ చికిత్స అవసరం ఏర్పడినప్పుడు ఈ కిట్లును ఉపయోగించుకోవచ్చునని సూచించారు. ఇందులో ఆయింట్మెంట్స్, లోషన్స్, కాటన్, క్లాత్ తదితర పరికరాలు ఉంటాయన్నారు. స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ వద్ద ఉమానారాయణ ఆసుపత్రిలో త్వరలో ట్రస్ట్ ను ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వసతి సౌకర్యాన్ని అందిస్తామని తెలిపారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది వైద్యనిపుణులు ఉమా నారాయణను అభినందించారు.

మెగా మైక్ ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీలకు శనివారం మండల సమావేశం మందిరంలో మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ మెగా మైక్ ఫోన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైన సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ మైకులు ఉపయోగించుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజల ఆధార్ అప్డేట్ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మైకులు ఇస్తున్న ఉదయశ్రీ

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్యం వహిస్తోందని, ఈ విధానాలను నిరసిస్తూ ఈనెల 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు డి.సత్తిబాబు కోరారు. మున్సిపల్ కార్మికులతో కరపత్రాలు విడుదల చేయించారు.

నర్సీపట్నంలో మాట్లాడుతున్న సత్తిబాబు

రాంబిల్లి:చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ పోస్టర్‌ను శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వివిధ రంగాల కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టుబానిసలను చేస్తూ లేబర్ కోడ్స్ తెచ్చిందని తెలిపారు. వివిధ రంగాల కార్మికులు దొరబాబు, వరహాలరావు, కృష్ణ, నానాజీ, సూరిచాయి. ముసలియ్య పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను కరకలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గునూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మిడ్డేమీల్స్ కార్మికులు బి.ఉమ, వై.వరహాలు, కాసులమ్మ, స్వరూప పాల్గొన్నారు.

సబ్బవరం : చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గొంతిన అప్పారావు, నాయకులు పూడి అప్పలనాయుడు, గొంప ముత్యాల నాయుడు, ఏలూరి శ్రీను, గొపి సత్యం, నక్కా సన్యాసిరావు, ఎస్.త్రినాథ్. ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని నర్సింగబిల్లిలో చలో ఢిల్లీపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీదేవి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అచ్యుతాపురం : చలో ఢిల్లీపై మండలంలోని కొండకర్ల, తిమ్మరాజుపేట, అచ్యుతాపురం, దోసూరు తదితర గ్రామాల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము ప్రచారం చేశారు. భవన నిర్మాణ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రూ.1100 కోట్లు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కె సోమునాయుడు, నాయకులు శ్రీను, తాతారావు, రాజు, రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

పక్కాగా భూముల సర్వే

- ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి -కొత్తకోట:రెండో విడత జరిగే భూ సర్వేలో ఎక్కడా సమస్యలు లేకుండా పక్కాగా నిర్వహించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం స్పష్టం చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన శనివారం జగనన్న భూ సర్వే, ఓటుకు ఆధార్ అనుసంధానం పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడత జరిగిన సర్వేపై రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చాయని, అటు వంటి పరిస్థితి ఈ దపాలో రాకుండా చూడాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వే సిబ్బంది సమన్వయంతో పని చేసి రెండో విడత సర్వేలో రైతుల నుంచి అభ్యంతరాలు, తప్పులు లేకుండా చూడాలని, రైతుల సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టాలని తెలిపారు. తహసిల్దార్ మహేశ్వరరావు, ఆర్.ఐలు సతీష్, చినబ్బాయి, మండల సర్వేయరు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం కష్టంగా గడిచింది

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం):2022-23 ఆర్థిక సంవత్సరం విశాఖ ఉక్కు కర్మాగారానికి కష్టంగా గడిచిందని, అయితే, ఉద్యోగుల సమిష్టి కృషితో త్వరలోనే లాభాల బాటలోకి వెళ్తామని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ అన్నారు. శనివారం ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో బహుళ సవాళ్ల కారణంగా ఈ సంవత్సరం కష్టతరంగా గడిచిందని తెలిపారు. రాయిబెరేలీలోని స్టీల్ రైలు చక్రాల తయారీ త్వరలో 55 వేలకు పెంచుతామని తెలిపారు. మూడుసార్లు భద్రతల విషయంలో ఉక్కు మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుందని అన్నారు. స్వదేశీ బొగ్గు వినియోగాన్ని పెంచినట్లు తెలిపారు. కస్టమర్ల నుంచి ముందస్తుగానే అడ్వాన్సులు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఒడిశా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలను త్వరలోనే తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తద్వారా ముడిసరుకు భద్రతను అధిగమిస్తామని అన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్లాంట్ చరిత్రలో ఇది అత్యంత కష్టతరమైన సంవత్సరమని పేర్కొన్నారు. తాము ఫినిష్ స్టీల్ ఉత్పత్తిని రోజుకు 12,500 టన్నులకు పెంచినట్లు తెలిపారు. కష్ట సమయంలో ట్రెజరీ నిర్వహణలో ఫైనాన్స్ విభాగ కృషిని, ఆర్థిక చతురతను ప్రశంసించారు. కార్యక్రమంలో స్టీల్ కమర్షియల్ డైరెక్టర్ డికె.మహంతి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎకె.బక్షి, పలు విభాగాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల పూజలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఐదు రోడ్ల కూడలిలో బాల వినాయక స్వామి దేవాలయంలో సహస్రనామార్చన నిర్వహించారు. విద్యార్థులకు రోటరీ క్లబ్ సభ్యులు పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, విద్యార్థులంతా మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఇన్నమింగ్ అసిస్టెంట్ గవర్నర్ పచ్చిగోళ్ల నారాయణరావు, క్లబ్ ప్రెసిడెంట్ సుతాపల్లి అప్పలరాజు, సెక్రటరీ జంపన నాగేంద్ర రాజు, ట్రెజరర్ ఫణి పాల్గొన్నారు.

చట్టబద్ధ పాలనను అపహాస్యం చేయడమే

కోనసీమ అల్లర్ల కేసులు ఎత్తివేతపై హెచ్ఆర్ఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్:కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మార్చినప్పుడు జరిగిన అల్లర్లలో నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధ పాలనను అపహాస్యం చేయడమేనని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) అభిప్రాయపడింది. రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, వాటి స్వతంత్ర ప్రతిపత్తిని నాశనం చేసి తమ జేబు సంస్థలుగా వాడుకోవడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యుజి శ్రీనివాసులు, వై.రాజేష్, తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వివిఎస్.కృష్ణ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తుని కాపు రిజర్వేషన్ల సభలో అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు ఎత్తివేసిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజికంగా, రాజకీయంగా బలంగా ఉన్న కులాలు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా, చట్టాలు తమను ఏమీ చేయలేవనే భావనను ఈ నిర్ణయం బలపరుస్తుందని పేర్కొన్నారు. రాజకీయ అధికారాన్ని విచక్షణ రహితంగా వాడుకొని, రాజ్యాంగబద్ధ వ్యవస్థలైన పోలీసు, న్యాయ వ్యవస్థలను బలహీనపరచడం సరికాదని పేర్కొన్నారు. కోర్టులు ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరించకపోవడం చట్టబద్ధ పాలనకే ముప్పు అని తెలిపారు. రైతులు, అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్, సఫాయి కార్మికులు, అసంఘటిత కార్మికులు, దళిత, బలహీన తరగతుల వారు తమ న్యాయమైన హక్కుల కోసం నిరసన తెలియజేసినప్పుడు నమోదైన కేసుల విషయంలో మాత్రం ఈ విచక్షణాధికారాన్ని పాలక పార్టీలు ఉపయోగించడం లేదని తెలిపారు. కోనసీమ జిల్లా అల్లర్లపై నిష్పక్షపాతంగా విచారణ చేసి, సామాన్యులకు చట్టబద్ధ పాలనపై నమ్మకం కలిగించాలని కోరారు.

పేదలకు ఉచిత సీట్లు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలు చదువుకునేందుకు విద్య హక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లు విద్యార్థులకు కేటాయించాలని మండల విద్యాశాఖ అధికారి పి.అప్పారావు సూచించారు. ఈనెల 10 తేదీలోపు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.